కథ :

# తంఫానం

అల్లం రాజయ్య

పొద్దటి బువ్వలు తినే యాల్లయ్యింది. అందరు పొలాలు దున్నేటందుకు సిద్ధ పడుతూ నాగండ్లు అమిరిచ్చేటోల్లు నాగండ్లు అమిరిచ్చు కుంటండ్లు. తాళ్ళు, దారెడు జొత్తెలు సదురు కునేటోల్లు సదురు కుంటండ్లు—జెరంత ముందుగ బువ్వలు దిన్నోళ్ళు సుట్టలు ముట్టిచ్చుకొని తుప్పతుప్ప ఊంచుకుంట అంతకు ముందు పట్టిచ్చిన గుడ్డ బనీండ్లు ఏసుకొని రుమాల్లు సదురు కుంటండ్లు—అడ్డ ధాలికాడ ఒకచేరొల్లి—నాది నాగలి సలుగయ్యిందని ఒకలు— ఎజుగైందని ఒకలు—సీకె బోయిందని ఒకలు —కాని బోయిందని ఒకలు అట్లాయినె నోట్లె మంచినీళ్ళు బొయ్యకుంట ఎవలకే తీరుగ మాట్లాడాల్నో ఆ తీరుగ మాట్లాడుకుంట ఒక్కొక్కపని జేత్తండు—కమ్మరింటి కాడ గుసుసుకుంట కమ్మరాయినె సుత్తెతోని కొట్టెడి కొడుతనే ఉన్నడు. కొంతి మొనరంట ఒకడు, కర్రు అంట మరొకడు వేగిర పడేటోల్లు పడ్తనే ఉన్నరు. మరింక ఆడోల్లు—తిన్న కంచాలు కడుక్కొని చిన్న పోరగండ్లను పెద్ద పోరగండ్లకు అప్పగింతలు పెడుతూ ఉట్ల మీద పగటి అంబల్లు, బువ్వలు సద్ది—సూరలో, పరమో పెట్టి పిల్లల బుజ్జగిస్తున్నారు. పసిపిల్ల తల్లులు గడపల్లల్లో కూసొని పిల్లగండ్లకు పాలిత్తండ్లు.

ఆకాశంలో మబ్బులు కమురుకుంటున్నాయి. సాకల్ది బట్టలు జమ జేసుకుంటంది.

ఊరంతా సందడి సందడిగ—రొచ్చు రొచ్చుగా, బురద బురదగా ఉన్న సమయంలో ఉత్తరం బాటు మర్రి సెట్టుకింది నుంచి అరుగురు రైతులు మోకాళ్ళ మంటి బురద కాళ్ళతో ఊరు సొచ్చారు.

“దున్నేవానికి భూమి — వ్యవసాయ ఇప్లవం వర్ధిల్లాలె—పల్లెల్లో పోలీసుల జులుం నశించాలె—పోలీసు క్యాంపులు ఎత్తెయ్యాలె—” నంట అరుసుకుంట—కుడి పిడికెల్లెత్తి తాప తాపకు, మాటమాటకు చిత్రంగా అరుస్తూ ఊళ్ళో నడుస్తున్నారు.

అప్పటికే ఆళ్ళ సుట్టు పోరగండ్ల మంద జమైంది. మరీ ఉచ్చిలి పోరగండ్లు, ఎర్ర రుమాలు పేగులు కట్టుకున్న కట్టెపుల్లలు బట్టుకొని వాళ్ళ రైతుల్లాగే అరుస్తూ మందలో కలిసిండ్లు.

ఊళ్ళోవాళ్ళ కిది కొత్తేమికాదు—వాళ్ళు ఇట్లా బర్లుకుంట వాళ్ళ ఊళ్ళె వాళ్ళే సానాసార్లు తిరిగిండ్లు—కాని పొరుగూరోల్లచ్చి తమ ఊళ్ళెతిర్గడం కొత్తగనే ఉన్నది.

389

మాదిగోళ్లు గీసంగతి ఎట్లిన్నరో ఎగపోసుకుంట ఉరికచ్చిండ్లు—ఎందుకంటే ఆళ్ళ సెరువు ముంగటి పదెకరాల పరంపోగు సౌడుభూమి ఇయ్యేడు దున్నిండ్లు—ఏమంట నాగండ్లు కట్టిండ్లో—ఆ భూమి పడావుగానే తన కింద ఉంచుకున్న ఆరోల్ల జెగ్గయ్య, కోమటి రామలింగు నాగండ్ల కాడికిపోయి సింగిబింగాడిండ్లు; తిట్టరాని తిట్లు తిట్టిండ్లు—"ఇది అన్నా యేమన్నరు. మంది సొమ్ములు గిట్లోజబర్దస్తీగ దున్నుకుంటె కలిగం మునిగి పోతదన్నరు." జెగ్గయ్య మాత్రం "ఇగో మిమ్ములందర్ని అధాలతుల్ల పట్టి సెంటర్ జేలుకు పట్టియ్యకపోతె నేను ఆరోని కడుపున్నే పుట్టలేదన్నడు."

మాదుగులు ఏమనలేదు. కాని నాగండ్లు ఆపలేదు.

తెల్లారి పంచాది తెట్టిండ్లు జెగ్గయ్య,రామలింగం — పొరుగూరు నుంచి పోలీసు పటేలు, పట్వారి, ఊళ్లె మాలిపటేలు, పెద్ద మనుషులు తిర్లేసి మర్లేసి "ఊళ్లెసిచ్చు పెట్టుడుమాదుగులకు బనాపుగాదన్నరు."

అప్పుడు సంగం ముంగట బడ్డది — పంచాతు ఎటు తెగక ముందే ఊళ్లె రైతులు కొందరు మాదుగులతో కలిసిపోయి పరం పోగు సౌడుభూమిల నాగండ్లు కట్టిండ్లు—పైగా ఒడ్లమీద ఎర్రజెండాలు పెట్టారు.

"మాపొలాలు గబ్జాచేసుకున్నరని" రామలింగం, జెగ్గయ్య పోలీసులకు జెప్పిండ్లు ఆళ్లెంట ఊళ్లె పెద్ద మనుషులు గావాయిపోయిండ్లు.

ఇగ బయ్యిబయ్యిన మోటర్లచ్చినయ్—గ మోటర్లల్ల పోలీసోల్లచ్చిండ్లు—వగు వేందో విసారం జెయ్యకుంటనే--గది అలవాటేనన్నట్లు—ఇతర కులాలోల్లను ఇడిసి పెట్టి మాదుగులనే జేలుకు పట్టుక పోయిండ్లు—అడిగే నాథుడు లేక మాదుగులు ఆరంది నాలు తానలనే ఉన్నరు. అయింక ఊరి సంగమచ్చి ఇడిపిచ్చింది.... ఈలోగా దున్నిన సెర్వుముంగటి పదెకరాల్లకు సెరువు నిండి నీళ్ళచ్చినయ్.... గాసంగతేమన్న తెలత్తదేమోనని— గీలొల్లి ఇనబడంగనే మాదుగులు ఉరికచ్చిండ్లు....

అచ్చినోల్లు ఒకలజబ్బల మీన ఒకలు సేతు లేసుకొని నినాదాలిచ్చేవాళ్ళను సూసుకుంట ఎనుకెనుక నడిసిండ్లు. అయిమూల లెక్కలేని పడుసోల్లు ఆళ్ళతోని గల్సి అర్సిఅర్సి కీకలు బెట్టిండ్లు—

390

నాగండ్లు కొడాలేసుకొని బయలెల్లినవాళ్లు, నాగండ్లు భుజాలమీన బెట్టుకొని పొలాలమీదికి బోయేపాలేరోల్లు ఆగి పోయిండ్లు—

పొరుగూరి నుంచి వచ్చినవాళ్లు నిసాదాలిచ్చి కుంట మూడు బజార్లకాడి కచ్చిండ్లు— అప్పటికీ పిల్లగండ్లుమొండిగోడ లెక్కి—పోయిండ్లు — మూడు పానాదులు బురద బురదగా ఉన్నాయి. సర్కారు బాయినీల్లు తొవ్వొంట పారి మరింత బురద య్యంది. ఒక్క రాయలింగు కూలిపోయిన మొండి గోడపక్క యాపకింద— పోలచ్చిమి పెక్క బొమ్మలున్న కాడ మాత్రం కాసంత పొడి జాగున్నది. ఆడ రెండు బండ్లు వానకునాని, కమ్మలు సిలిమెక్కి ఉన్నాయి. ఆ పక్కనే పోసయ్య ఎడ్ల కొట్టం లేక కట్టేసుకున్న ఎడ్లు దోమలకు సెవులు టపటప కొట్టు కుంట ఈ లొల్లికి మట్ల మీదనే గింజుకుంటున్నాయి.

పొరుగూరి నుంచివచ్చిన వాళ్ళల్లో ఇద్దరు గీతల లుంగీలు ఎగగట్టు కున్నారు. ఎల్సిపోయిన అంగీలేసుకున్నారు. మరొకాయన కాసెక్కిన ధోతి ఎగగట్టి గుద్దబనీ నేసుకున్నాడు. అట్లాంటి కాయరంగు ధోతే నడికట్టు బిగిచ్చి కట్టి పెయిమీస అంగీ లేని కోల ముఖపు ఒక్క ముసలాయన—అసుట్టు పక్కల ఆడోల్లను కేకేసి "రాండ్లి-రాండ్లి పొద్దెక్కి పోతంది-నాలుగంటె నాలుగే ముచ్చెట్లు ఇనిపోండ్లి-దండుగాతగదా-మీకు మనుసుకత్తె ఇసారం జెయ్యిండ్లి-లాపోతే ఎవల సందాల ఆళ్ళంబోవాలె." అంటున్నాడు.

ముఖమంతా రెచ్చికొట్టుకొని ఓటుగాలు రాయలింగం ముసలాయన కెదురచ్చి "పల్లె కొంగలు బయిలెల్లిండ్లన్నమాట—సాలు సాలునయ్యా—మా పొల్లె సిచ్చు పెట్ట కుండ్లి" అన్నాడు.

ముసలాయన కోపగించేది పోయి—పైగా పెకపెక పండ్లు బయట పడేటట్టు నవ్వి "సరెగని కాసింత పొవాకుంటె గెట్టు — దవుత తీపు మెక్కుతంది." అంటూ దగ్గరికి నడిచిండు.

రాయలింగు అయిష్టంగానే ఓపొగాకు ముక్క ముసలాయన సేతులేసిండు. "అబ్బోరాయలింగన్న—కొంచె గానికి సిర త్తెమంచ మెక్కి తూలినట్టు — నీకొడుకులు 'కోరుట్ల'న బత్తాలు మోసి ఇన్నూరు పంపెటాల్లనే నువ్వు మాదండి ధనవంతుస్నను కుంటన్నావే ? నువ్వు ముడ్డికి సక్కగ ధోతిలేకున్న దొరవై పోయినావే—" అన్నది దాదోల్ల ముసల్ది—

దడి ఆవలి నుంచి దానికోడలు పొట్టైరకమ్మ గడుక కుండ సేతుల బట్టుకొని "మందికి మాన్నగాలం బట్టె—గురుత్తం లేదు. సంగమచ్చి నంక రూపాయినర కూలి

అయిదైన నిరుత్తం లేదు." అన్నది.....

సెవుటు రాముక్క ముసలాయిన దగ్గరి కచ్చి "జానే పెద్దనాయిన – మీదే వూరు ?" అన్నది.

ముసలాయిన మాది "రామయ్యపల్లె" అన్నాడు.

"ఓహో రామయ్య తోలింకా?" అన్నది.

"కాదే సెవుటుదాన రామయ్యపల్లె" అని వెంకమ్మ ఈకంత నోరు తెరిసి చెప్పింది.

రాయలింగు 'పోకడంత' దిగిపోయి తలదించుకొని సింగులు దున్నుకుంట మూడు పానాదులకాడికి నడిసిండు.

"ఓ సెనాన్ని జాప సెనాన్ని"– అనుకుంటచ్చిండు మొక్క బీడికింద ఉంచి గాలయ్య.

"నువ్వునేవని సూత్తన్నా–దాదా–మనోల్లు భూలచ్చిమి కాడ సభ పెదలే సిండ్లు–" అన్నాడు ముసలయ్య.

ఇద్దరు కలిసి వచ్చేసరికి లుంగీలు కట్టుకునోళ్లు దప్పు తెప్పించి – "దుక్క దున్ని–దుక్క దున్ని

దొందకై తిరా మాయన్న సీతగాడ–" అంటూ పాడుతండ్లు–....

మోతెవరి రైతులు, పాలేర్లు నిలబడిపోయిండ్లని రుసరుసలాడుకుంటచ్చి – ఈ తతంగమంతాజూసి ఏమంటే ఏమైతదోనని ఏమనకుంటానే ఎటోడటు జారుకున్నారు.

"ఊరు మనదిరా వాడమనదిరా" అంటూ ఫోతిరైతు పాడిండు–....

"ఇగగ పాటలకే మచ్చెగని ఏంవో చెప్పుతనంటిరి– ఆవల మబ్బు సుట్టు కత్తంది.... ఏడవది అన్నె ఉన్నది. జెరంత పొద్దెక్కితే ఇయ్యల్ల ఉత్తవస్నానికి కయికిల్లుబోతయి–" అన్నదొకామె గుంపుల నుంచి–

అప్పుడే బురదకాళ్ళతో ఉరికొచ్చిన మొగిలి దప్పుతీసుకోని దనదనలాడిచ్చి పాటెత్తుకున్నడు. ఊళ్లోలే సులిబట్టిండ్లు.

ఉరుము ఉరిమింది. భూమయ్య ఎద్దు ఒకటి తలుగు తెంపుకున్నది. దాన్నెవలో మల్లాకట్టేశారు.

మాటలకచ్చేటాల్లకు నవ్వింటే నవ్వనుకున్నరు కానేం. అఖరుకు "నాకేమన్నా సిగ్గా— ముసలోన్ని— సరె— నీవన్న అక్కలసుక్కల మాట్లాడ్తె ఎక్కిరియ్యకుండ్లి-" అన్నాడు ముసలతను.

"నువ్వు మాట మాటకు వానవ్వల కుక్కల్ దెంగ అనకు గంతే" అన్నాడు లుంగీ కట్టుకున్నతను.

అది విన్పించుకోకుంటనే— "ఏ తల్లి— మొగని మాటే మర్సిపోయిన— ఆఁ మతికచ్చింది— కామ్రేడ్లు....అక్కలాలా! తమ్ములాలా — మన ఇలాకాల మనం సంగాలు పెట్టుకున్నం— కూల్లుపెంచుకున్నం— అక్కరంగ దీసుకున్న భూములు పంచాతుల పెట్టి గెలుసుకున్నం- గజగిత్తాల పెద్దపల్లి, ఉజూరబాదు తెల్లయితె—ఎనుకట తిన్నదండుగలు కక్కిచ్చిండ్లు— ఇన్నరా? నాకు నాకు మతుకత్తలేవుగని— ఆఁ మన పంచాయతులు మనమేం తెంపుకుంటున్నం. పాలేరోల్ల జీతాలు పెంచుకున్నం — ఇంతెందుకు కుంటిగులాప్ నబ్బింత వర్నాలు ఒక్కటైనయి. ఇగ వానవ్వల కుక్కల్.... సరె సరె— నా మాట మోటు మాట— ఊళ్ళల్ల దొరలకు ముడ్డి కింద మంట పెట్టినట్లయ్యింది.— "తావేలు" మీ తెలితే గదా? మనం తప్పినట్టు పడ్డప్పుడు దొరల మూతులు తావేలు తీర్గ బొచ్చెలనే పెట్టుకున్నరు — మంలు ఎప్పుడైతె మనం పెట్టినమో ఇగ తప సీమకండ్లు పులపొడిసి బొచ్చెల నుంచి మూతులు జూపిండ్లు— ఇగ దానికి తాడు బిగిచ్చేదున్నది.... అల్ల పిస పిసలాడిండ్లు —బలమున్నోడు తుపాకులున్నోడు ఎదుటకే అచ్చి మన మీన బడ్డడు. పెరిగిందేగని తరుగలే — ఇగగిది గిట్ల గాదని—పోలీసోలకు జెప్పుకున్నరు. అప్పు ఊళ్ళమీన బడి రాడికి అయిదేండ్లాయె ఎంత జేయాల్నో అంత జేత్తండ్లు—ఇన్నరా: గిల్లంటే కప్పతండ్లు—మీదికెళ్ళి అధాలతుల, కేసుల, అదేందో కల్లోల సట్టములు—గది తెచ్చిండ్లు—అయితే గిది ఆగిందా? జగిత్యాలల బుట్టింది—అన్నాల్ల దిగ్గింది—ఆదిలబాదుల గోండోల్లు, ఓరగల్లు, నిజామాబాదు—ఇట్లా ఓసుట్టు గిరేసుకున్నది. కోమలి పోరగండ్లు అప్పు లడాయికి దిగుతె మనం దిగొద్దా? అప్పు తుపాకులు బట్టుకుంటె మనం పొరకలబడితె ఎల్లుతదా? ఇగ మీకు దాసె దొంగతనమేమున్నది - మనోల్లు తుపాకులు తీసుకొని లడాయికి తయారయ్యిండ్లు—కావాలెగద-అరెబయి నేసుకున్న పెండ్లాన్ని రావణుడు సెరబట్టిండ్లు — ఊఁ అంటె అత్తదా? ఆఁ అంటె అత్తదా? ఇజ్జెం జెయ్యాలె — సీత సెర లిడిపియ్యాలె- దున్నెటోనికి భూమి గావాల్నంటె గంతె-పాండవుల కతల గంతెవున్నది. ఇగగిదంత

393

చెప్పుతె భారతం-ఎందుగ్గని - ఊళ్ళల్ల పోలీసోల్లబడి బెల్లం పాడుజేత్తండ్లు - మనకు సెప్పుకోను దిక్కెవలు ? సెప్పుకోను బోతె పట్టుకోని తన్నెటట్టున్నది — ఆడాడ మన పిల్లలను ఉద్యమా ర్తంగ యపాకుతీసి సంపుతండ్లు - పల్లెల్ల పోలీసోల్లు కాంపులుబెట్టి పచ్చిబూతు సేత్తండ్లు-కనుక-మనం అన్నాలర్ల బందువులు బెట్టాలె-ఒరే దొంగలంజ కొడుకుల్లాలా-మేం ఊకోమని చెప్పాలె—మా కస్టం సుకం జూడని గాడిదకొడుకులు—గిప్పుడు మేం కండ్లు తెరిసెటాల్లకు తుపాకులేసుకొని మీని కత్తంక్లా అని ముడ్డిమీన తన్నాలె-ఒక్కరుగాదు ఏల ఊళ్ళన్ని ఒక్కటేనని చెప్పాలె-కాంపులు ఎత్తేసేదనక లొల్లి జెయ్యాలె-ఇయ్యేల్ల మావూల్లె కాంపున్నది. రేపు మీవూరి కత్తది - సేతులు కాలినంక ఆకులు పట్టుకోవద్దు — రేపు మంగళారం - మొత్తం బందువెట్టుండ్లి-అచ్చె పోయె బస్సులాపుండ్లి -" ముసలాయన పిడికిలి బిగించి తన చేతుల తనే గుద్దుతూ చాలా చెప్పాడు.

ఆ తరువాత ఆ వూరి సంగపెద్ద గాలయ్య మాట్లాడిండు. "పేదోల్లకు పేదోల్లె మద్దతు తెలుపుకోవాలన్నడు. తమఊళ్ళో సంగం ఇంకా బలపడాలెనన్నాడు-నచ్చిందోనాడు పుట్టిందోనాడు— ఇది కష్టాలు, నష్టాలు అత్తే రానియ్యి అన్నాడు— పరదనుక మనం జాంచె బతుకులు బతికినంమురింక. మనుషుల తీర్గ బతుకుదామన్నాడు.

వాతావరణం వేడెక్కింది - పొరుగూరోల్లు ఇంకో వూరికి వెళ్ళిపోయారు. కొందరు గునిసిండ్లు-మరికొందరు భయపడ్డరు. యువకులు ఉత్సాహపడ్డారు.

పోతూ పోతూ ముసలాయన గాలయ్యను ఓరకు పిల్చి - "ఈ పొద్దంత గీ ముచ్చట నడుగుతది - తలోతీర్గ తలపోత్తరు. నాత్రికి మంచోల్లను బిలిసి ఎట్లెట్ల జెయ్యాల్నో ఎవలేం పనులు జెయ్యాల్నో అనుకోండ్లి-బందు బరుపూనగ జరుగాలె—సానా వూళ్ళల్ల జరుగుతది—మా తీర్గనే సానామంది పచారానికి బయిలెల్లిండ్లు-" అని చెప్పిపోయిండు.

ఎటోల్లటు పనులమీనికి పోయేటాల్లకు పొద్దు నెత్తిమీనికి రానేవచ్చింది.

* * *

ఏమంట పొద్దుగూకిందో తుపతుప సినుకులు మొదలైనయ్. ఆ సినుకులను లెక్క చెయ్యకుంట గాలయ్య ముఖ్యులందరిని పిలిచిండు. బర్ల మచ్చయ్య ఇంటి కాడ ముఖ్యులు కూసున్నరు.

394

ఇసారాలు సాగినయ్. బందు ఎట్లెట్ల జెయ్యాల్నో నిర్ణయించుకున్నంక - "మరిగిది మన అన్నకెరుక లేకుంట జేత్తన్నం ఆ యింక మల్లా ఏదన్న ఉల్టాకత్తె" అన్నాడు ఒకడు.

"అయిందానికి కానిదానికి ఆళ్ళే రావాల్నంటె ఆళ్ళకు గీ ఒక్కారె ఉన్నదా? అచ్చినోల్లు అంతట జేత్తన్నరని చెప్పలేదా ?" అని సదిరి చెప్పిండు మరొకడు.

ఎందుకైన మంచిదని మొగిలిని పిలిచి అన్నకు ఎరికజేసి రమ్మని చెప్పించిండు గాలయ్య. గీ ముచ్చట బయటపడకుంటె మంచిదని కడుపుల బెట్టుకున్నడు.

అందరు అనుకున్న ప్రకారంగా ఎవలవాడకు వాళ్ళు మందిని కుప్పేసి రేపు జరుగబోయె బందుగురించి చెప్పాలని లేచిపోయారు.

వర్షం తగ్గింది. ఆకాశంలో జెగజెగ చుక్కలు మొలిచినయ్. తూర్పున ఎన్నీల పొడిసింది-ఏల్పుల ఎల్లయ్య దప్పు సంకకేసుకొని సాటింపు దప్పు కొట్టు కుంట బయలుదేరి మజ్జె మజ్జె ఆగుతూ "ఓహో .... రేపు పల్లెల్ల నుంచి పోయెటోల్లు ఎల్లిపోవాల్నని అన్ని పనులు బందుపెట్టాలని రైతుకూలి సంగం ఇందుమూలంగా తీర్మానం చేసిందని అందరికీ చెప్పమన్నదహో...."

మళ్ళీ దప్పుసప్పుడు జెజ్జెనుక — జెజ్జెనుక —

అడ్లీరయ్య రొట్టె నములుకుంటనే ఈతలికచ్చి - కొంచెం తూలుతూ—"ఓర్నీ యవ్వ—బందంటె సారాదుకాణం సంత బందేనారా ?" అన్నాడు.

"అన్నీ బందే" అన్నాడు ఎల్లయ్య.

"ధుత్తెరి లొట్టపీసు సంఘం" అనుకుంట పడబోయి తమాయించుకొని- ఇంట్లకు పోయిండు.

ఎల్లయ్య వెళ్ళిపోయాడు - అడ్లీరయ్య ఏదో మతికచ్చి తూలుకుంట జెగ్గయ్య ఇంటికేసి నడిచాడు.

"నీ బుద్ధి పాడుగాను - సాడుగొట్టు బుద్ధి" ఈరయ్య భార్య గులుగుతోంది.

అట్లావీరయ్య పోయేటాల్లకు జెగ్గయ్యఇంట్లో అయిదుగురు ఉట్టిపై కూకుండి ఏమి చేయాలా ?" అని విచారం చేస్తున్నారు. పెద్దలంత ఒక్కకాన్నే ఉన్నరు. సెనార్తి - ఇన్నరా ?

395

"రేపు బందట - " అని దొంగనవ్వు నవ్విండు అడ్లీరయ్య.

"మారెనెకే - గీతమేం కూసున్నావని బయటంటె నీ బొక్క లిరుగుతయ్" అన్నాడొకడు.

"ఆశ్శేపున్న పప్పకీత్తరా (పావుశేరు సారుకు ఇస్తరా? " అన్నాడు వీరయ్య.

"పవ్వలేదుగివ్వలేదుపో - " అన్నాడొకడు.

"వానినోరు మంచిదిగాదు - " అని జెగ్గయ్య అయిదురూపాయలిచ్చిండు.

"దొంగలంజకొడుకులు ఓపదిరూపాలన్న ఇత్తరనుకుంటె" నడుసుకుంట 'జంబిచెట్టుపేరు' కట్టుకొని బురదలపడిలేచి-

"బంచత్ బందే చెయ్యాలె - బంద్-" అనుకుంట తూగుకుంట సారాదుకాణం దగ్గరికివెళ్ళి రూపాయి ఉద్దెరపెట్టి అయిదురూపాయలిచ్చి - ఓపవ్వకాగి ఓనవ్వావరకు సంచి జేబు తీసుకొని నడిచాడు-

అయిదుగురిలో ఒకడు బండికట్టిచ్చుకొని పోలీసుల దగ్గరికి పోయిండు. అసంగతి వీరయ్య చూపెగాలయ్యకు చెప్పిండు....

అంతట బురుగంగ పోలీసులు అత్తెరానియ్య అకీ సూద్దాం. అనుకున్నడు గాలయ్య....

* * *

"ఎటుబోయినవే సావిత్రి" అనుకుంట పంచాల్లో నుంచి లేచింది నర్సమ్మ - 'తడుకపుక్కపోగు' సదురుకొని - ఎంటికలు గోల్ల కొట్టుకొని - ఆవులిస్తూనే - "పిల్లా ఎటుబోయినవే - " అంటూగావుకేక పెట్టింది.

సావిత్రి ఉలిక్కి పడిలేచింది. ఇంకా చీకటి చీకటిగానే ఉన్నది.

"కొడుక్కింకా తెల్లారలేదా ? నాత్రంత తెల్లెపదాలు పాడుకుంట తిర్గుడు- అంబటాల్లయ్యేదనుక పంచాల నేసుడు. లేపి జెర పొలం కాడికి బొమ్మను" అన్నది.

"అయినె నాత్రింటికి రాలేదత్తా ! " అన్నది భయంభయంగా.

"ఆడు దొత్తిలకు ఏగ్గై పోయిండు-పెండ్లాంపోయిలేదు. పని పోయిలేదు. మాకే ఈ సంసారాని కగ్గికల్లి ఎరియ్యవరంగాడు. పెద్దోడు ఏదో నాలుగు పైసలు సంపాయించుకత్తనని కాలేరు (బొగ్గుబాయిలకు) పోనికి బోయిండు. ఇగగీడు బున్నెకిడిసి నట్టయ్యిండు." పంచమెత్తుకుంటనే నర్సమ్మ గులుగుతోంది.

సావిత్రి మనసు చివుక్కుమన్నది. మరింక అత్తనోరు మల్ల నిదుర బోయే దాకా పై డికంబె పలికినట్టు ఇట్లాతిడుతూనే ఉంటది. తన భర్త మొగిలికి నెత్తి లపేసు, పారినట్టన్నా కాదు. ఈ కుటుంబం ఎందుకో తనకర్తం కావడంలేదు. భర్త ఎందుకు తిరుగుతాడో తనకు ఎంత ఆలోచించినా అంతుపట్టదు. కాని మొగిలి పాడితె కడుపుల దేవినట్టుగా ఉంటుంది.

కాలకృత్యాలకోసం లేచి వెల్లిన సాంభయ్య దగ్గుకుంటచ్చిండు కాళ్ళు చప్పుడు దగ్గు తప్ప మనిషి చీకటంత నలుపు-పైగా అతనెప్పుడు అంగీ తొడగడు.

"ఏమే - మొగిలిగాడు పొలంకాడికి బోయిండా ? చిన్నోడు ఎడ్లిడుసుక పోయిండా ? మల్ల అంబటేల్లకు నాగలిగడితె ఎడ్లు సొడసొడలు బోతయి- ఇంత పసుకన్న కంకుతయి. గొల్ల లంజకొడుకులకు కేవుర మెక్కింది - పసుకమందులు ఉన్నలబ్బికొడుకులకే పెట్టిరి- ఇంక పొలం మూడోసాలు కాకనేపాయె - కయికెన్నడు జేసేం - నారుపెరిగిపోబట్టె - " అంటూ కన్నకన్నమళ్ళానగ్గి కాంద్రకిచ్చిఉమ్మేశాడు.

"నీకొడుకు నాత్రి ఇంటికే రాలేదు." అన్నది నర్సమ్మ చేతులారుస్తూ-

"మారే నావశంగాదే—మంచి మంచోల్లకు సావు వెత్తండు. నాకు సావు రాదు...." దగ్గు ఇంకా సాంభయ్యను మాట్లాడనియ్యలేదు.

"నువ్వేమొ పెద్ద పొల్లగాని దగ్గరికిపోయి గోంత దావఖానలనన్న సూయించు కోవైతివి....సూసుకుంటపానమీనికి దెచ్చుకుంటివి-పైసల మనం సంపాయించినంగని-పైసలు మనలసంపాయించలేవు గద— అప్పొసప్పో అయితే ఆయింక తీర్చుకుంటాం. పెద్దాపెరంట-ఇస్నారు కర్చుబెట్టి పెద్దావీరకుగొలిత్తె సిన్నమెత్తు తక్కువగాకపాయె." నర్సమ్మ సదువుకుంటనే చిన్న కొడుకు మంచంలో చూసింది. చిన్న కొడుకు తిరుపతి లేడు.

"ఈ గాడిదికొడుకు ఏడబోయిండో?" నర్సమ్మ

సావిత్రి రాత్రి కుండలు జాలారి దగ్గర గీకుతోంది. ఓచెవ్వు అత్తమామల కేసి వేసి ఉంచింది.

అప్పటికి తూరుపు రేకలు పారి తెల్లగా తెల్లారిపోయింది. చెట్లమీది పక్షులు గుంపులు గుంపులుగా అరుస్తూ ఎగిరిపోతున్నాయి. ఈపాటికి వూరు యమసందడిగా ఉండాల్సింది. గొడ్ల బోయుని అరుపు-లాగెలు, అవుల ఒర్లుడు, బర్ల గిట్టల చప్పుడు, ఏది లేదు .... మనుషులు తిర్గడంలేదు, వూరంతా నిశబ్ధంగా ఉన్నది.

397

"ఊరోళ్లకేం బుట్టిందవ్వా!" అనుకుంట నర్సమ్మ గడికాయ్యల దగ్గరి కొచ్చింది.

అప్పుడు పెట్టే పెడిన కేకలు, అరుపులు కోమటోల్ల కొట్టాల దగ్గరి నుంచి విన్పించాయి.

"దున్నేవానికే భూమి"
"పల్లెల్ల పోలీసు క్యాంపులు...."
"....ఎత్తి వేయాలి"
"దొర జులుం...."
"...నశించాలి"

అప్పుడు విన్నటి దినం రామయ్యసల్లె రైతులు రావటం నర్సమ్మకు యాదికి వచ్చింది.

ఇంతలోనే సావిత్రి, సాంబయ్య కూడా వాకిట్లోకొచ్చి నిలుచున్నారు .... అప్పుడు తొంపరు అయిలుగాడు జుట్టింక ఇరబోసుకొని—చినిగిన బట్టలు లొడలొడ లాడుతుంటగా రొమ్మమీన కొట్టుకుంట "నాగండ్లకు బోయినోల్లు నవ్వుకుంటచ్చిరి. గుంటుకలకు బోయి నోల్లు గంతులేసుకుంటచ్చిరి." అనుకుంట ఎగురుకుంట పాడుకుంటచ్చిండు.

"వారీ అయిలుగ-ఏమచ్చిందిరా?" నర్సమ్మ ముక్కుమీద వేలేసుకొని అడిగింది.

"ఓనర్సవ్వ — నీ కెర్కలేదా? నాగండ్లు ఇడిపిచ్చిండ్లు, బుంబులిడిపిచ్చిండ్లు, నాట్లు గీట్లు బందు—పాలేరోల్ల పనులు బందు" గొడ్లు బర్లు నట్లమీన్నే— ఇయ్యాల్ల బందు—బందు" అని చెప్పుతూనే పరిగెత్తాడు.

"వూ( కొడుకుల తూడుకలాసినయనుకో." అన్నాడు సాంబయ్య దవడ కొరుకుతూ—

గుట్టమీనవాన గొడితే బొలబొల వానొచ్చినట్టు ఊళ్ళెజనం, ఆడోల్లు, మొగోల్లు, బజారు పికపికలాడంగ—ఎర్రజెండలు పట్టుకొని బజార్లకు రానే వచ్చారు. తనకొడుకు మొగిలయే గొంతెంతా చించుకొని అరుస్తున్నాడు — దానికి ప్రతిగా మిగతా వాళ్ళు మొత్తుకుంటున్నారు. నర్సమ్మకు ఆ అరుపులకు ఎందుకో గుండె దడదడలాడింది.

కాళ్ళు పనికిరావ్. ఏదో చెప్పరాని ఆవేశం ఒళ్ళంతా కమ్మినట్టు—అగులుగుబులైంది.

సావిత్రికి జిలజిలా నెత్తురు ఒళ్ళంతా పాకింది. అత్త లేకపోతే తను పరుగెత్తి ఏదో ఒకటి అరిచేది అందరిలాగా-సాంభయ్యకుమాత్రం యమకోపంగా ఉన్నది. వీళ్ళు తేరుకోక ముందే ఊరేగింపు మూడు బజార్ల దగ్గరికొచ్చింది. పఱ పఱలాడే బురదలోనే జనం నిల్చున్నారు.

రాయలింగు పెద్ద బండి మీద మొగిలి ఎక్కిండు. దావాపుగానిన్నటిమాటలే మాట్లాడిండు.... నర్సమ్మ బజాట్లో మంది వెనుక నిలుచున్నది. ఆమెకు ఒక్కమాట అర్థం కావటం లేదు.... ఆ మాటలు వింటున్నదోలేదో కూడా చెప్పలేం. కాని మొగిలి నోరు, కళ్లు, ముఖం, చేతులు ఆడటం చిత్రంగా చూస్తున్నది.—

మళ్ళీ వూరేగింపు కదిలింది — వూరంతా తిరిగింది. మళ్ళీ మూడు పానాదుల దగ్గరి నుండి వాగుకేసి నడిచింది. వూరేగింపు అంతకంతకు పెద్దదయ్యింది.

నర్సమ్మ తేరుకొని ఇంటి కొచ్చింది—గడనక్కడి పక్క సాంభయ్య తల పట్టుకొని కూర్చున్నాడు. సావిత్రి మొగురం పట్టుకొని నిల్చున్నది. అప్పటికి ఎండ పొడ సింత మీద నుండి వాకిట్లో పారాడుతోంది.

"ఏమాయెనె కొడుకు రాజిరికం సేత్తంటె కండ్లు నిలబడి పోయినాయె — సిన్న పోరన్నన్న పిలువక పోయినవ్ — ఇయ్యేడు పొలం సున్నేగని—ఎడ్ల బక్క పట్ల మీన సత్తన్నయిగదా !" అన్నాడు.

నర్సమ్మకు అప్పుడు చిన్న కొడుకు మతికొచ్చాడు. తను చూడనే లేదు. పిలుచుకొస్తనని బయలు దేరింది. వాగుదాటి రోడ్డు దగ్గరి బస్సుస్టేషీ దగ్గరికి — చేరేసరికి అక్కడ యూపల కింద ఇసుకవేస్తే రాలకుంట జనం. మూడూల్లోల్లు కలిసి పోయిండ్లు. గాలయ్య మాట్లాడుతున్నాడు. కొత్తగా డప్పులు, పదాలు....

ఇంతలోనే బస్సొచ్చింది. జనంతాని మీదికెగ బడ్డారు. టైర్ల గాలి విప్పేశారు. మందిని అందర్ని దించేశారు. వచ్చిన లారీలను, ట్రాక్టర్లను ఆపేశారు. అంత గందర గోళంగా ఉన్నది. ఆ మందిలో తన చిన్న కొడుకు కనిపించ లేదు .... మందిలో వెతికి చూసింది...."మీ తిరుపతి పొరుగూరు పనులు బందు పెట్టియ్యటా[illegible]పోయి

399

నోల్లతోని పోవచ్చని" నీలమ్మ చెప్పింది....

నర్సమ్మ మళ్ళీ ఇంటికేసి తిరిగేసరికి అంబటాల్ల దాటి పోయింది.

* * *

అత్తగారింటి నుంచి పెండ్లాన్ని తీస్కొని వచ్చిన గడ్డంరాజాలు ఎండ నుంచి గుడిసెలకొచ్చి కండ్లు కన్పడక—కాసేపు నిలబడి గప్పుడే ఒకాలు సొప్పుకొని గటుక తింటున్న తల్లిని చూసి " ఏందే అవ్వఇయ్యల్ల నాట్లకు బోలేదా ?" అన్నడు.

"ఇయ్యల్ల నాట్లేడియి. అంత బందు. " అన్నది.

"బందేందే:" అని "అట్లయితె మనూల్లెసుత జేసిండ్లన్నమాట — మాఅత్త గారూల్లె బందే—ఊరేగింపులకు రమ్మంటె ఎట్లనో తప్పిచ్చుకచ్చిన — " అను కుంటనే ఎక్కెట్ల జర్గిందోనని చూసొద్దామని బయటికి నడిచాడు.

"ఓ—అంతయిపోయింది. ఎవలిండ్ల కాళ్ళుబోయిండ్లు—ఎవల జోలికి పోకు సుమ్మీ—ఎవలను పట్ట పగ్గాలులేవు. " అన్నది తల్లి—

"గిప్పుడే అత్తిమి—పోకుంపేంది. " అన్నది భార్య.

"దెహేఁ మీకే మెరుకనే— " అనుకుంట కంకరరోడ్డెక్కి బస్సుస్టేజీ కేసినడి చాడు గడ్డం రాజాలు.

యాపలకింద నదీనప్పుడులేదు .... ఒక్క అడ్లీరయ్య మాత్రం నిన్న కొను క్కున్న పవ్వ తాగి — 'సారాగుడిసె తడు కెప్పుడు తీత్తరా' అని — ఎదీలె పడి కూర్చున్నాడు.

"ఎందే అడ్లీరన్న రంధిపడి కూసున్నవ్." రాజాలు.

"సంగపోల్లకు బుద్దిలేదెహేఁ—బందు పెడితె అన్నిబందువెట్టిరిగని గీ దుకాన పన్నకుల్లా ఉంచద్దా. " అంతెత్తు లేచాడు.

ఆమాట అంటుండగానే బయ్యున జీబు దూసుకొచ్చి రోడ్డుమీదాగింది—అందులో నుండి గుప్కి గుప్కిన పోలీసులు, ఒక యస్సై దునికారు—

"తెలిపూకా. పకుడో : " అంట లాఠీలతో కొట్టుకుంట రాజాలును వడ్లీ రయ్యను జీబులో పడదోశారు.

"మేం సంగపోల్లంగాదు దొరా ! "వడ్లీరయ్య మొత్తుకున్నాడు.

"బస్సులనాపుతారు బంచత్—బందు పెడుతారు—పోలీసు క్యాంపు లెత్తియాల్నా

—డోకిలికే—పోలీసోల్ల తడాఖాసూసుకో— ” అంటూ కొట్ట సాగిండ్లు—

“మాకే మెరుక లేదుదొరా ! మావూల్లె గా మొగిలి, గాలయ్యలు సేసిండ్లు ” వడ్లీరయ్య నెత్తురు కారే నోటితో—

ఆ మాటతో వీరయ్యను కొట్టడమాపారు. వీరయ్యను ఇద్దరు పోలీసులు జీబు దించి రెట్టలు పట్టుకొని ఊళ్ళెకు నడిపించుక పోయారు. అప్పటికే వార్త తెలిసిన జనం తుమ్మలు, తంగెళ్ల పట్టుకొని పరుగెత్తారు.

మొగిలి అప్పుడే అన్నంమీద కూర్చున్నాడు. నర్సమ్మ, సాంభయ్య తలో పక్క తిడుతూనే ఉన్నారు. పోలీసులు ఇంట్లోజొచ్చి ఎంగిలి చేసనే మొగిలిని బయటకీడ్చు కొచ్చారు. గాలయ్య దొరకలేదు. ఏతో చెప్పుదా మనిపచ్చిన రాయ లింగును, లసుమయ్యను, మరో ముగ్గురిని, వడ్లీరయ్యను, రాజాలును పట్టుకొని తన్ను కుంట తాలుకాకేసి తీసుక పోయారు.

నర్సమ్మ దిగ్భ్రాంతి నుండి తేరుకునేసరికే సావిత్రి ఏడుస్తోంది. ఊరుమీద ఊరుబడ్డది....ఏడుపులు, తిట్లు—

* * *

మొగిలి జైలునుండి విడుదలై వచ్చేసరికి పొలాలు కలుపులకొచ్చాయి. ఊళ్లో చాలా సంగతులు జరిగాయి. పరంపోగు చెరువు ముందటి పన్నెండెకరాలు ఊరంతా కలిసి దున్ని అలుకుడు చేశారు.... చిన్న చిన్న ఘర్షణలు అనేకం జరిగాయి —మరి కొన్ని కేసులు, మరికొన్ని మూర్లు పోలీసు దాడులు, నినాదాలు, గోడల మీద రాతలు, వూరేగింపులు, పంచాయతులు ఇట్లా చాలా చాలా జరిగి అన్ని ఊళ్ళల్లాగే గాడుపు దుమారంలో మొదటి కంటా వూగిన చెట్టులాగా ఆ ఊరు వూగింది. ఆ చెట్టు రెమ్మ రెమ్మ, కొమ్మ కొమ్మ, ఆకాకు కదిలిపోయినట్లుగానే — ఆ ఊళ్లోని ప్రతి కుటుంబం పునాదులతో సహా కదిలి పోయింది; ప్రతి మనిషి కదిలి పోయాడు.

ఇవ్వన్ని మార్పులు అంతస్పష్టంగా బయటికి కనిపించేవి కావు — ఇంతకు ముందు పాలేర్లను, కూలోల్లను ‘లంజెకొడుక’, ‘లంజెముండ ’ అని పిలిచేపిలుపు స్థానే పేర్లకు ప్రాముఖ్యం వచ్చింది.... పంచాయతులు ఊరి పెద్దల చేతుల్లో నుండి జనం చేతుల్లో కొచ్చాయి. పెండ్లిల్లు, పండుగలు ఊరి పెద్దల కను సన్నల్లో కాకుండా తమంతట తామే చేసుకునే మార్పొచ్చింది.... ఇట్లా చెప్పుకుంట బోతే ఎన్నయినా చెప్పొచ్చు. కట్టు, బొట్టు, మాటతీరు, నడకతీరు, పనితీరు అన్ని గుర్తుపట్ట నంతగా

మారిపోయాయి....

ఈ గాడుపు దుమారంలో జెగ్గయ్య కుటుంబం తాలుకాకు తరలి పోయింది.... గాలయ్య మరో ఇద్దరు యువకులు రహస్య జీవితానికి వెళ్ళి పోయారు.

* * *

ఆకాశంలో తెల్ల మబ్బులు జోరుగా తిరుగు తున్నాయి. పడమటి దిక్కు గుడి మెట్టు వెనుక కేసి పొద్దు వాలిపోతోంది. దళ్ళ మీద బీర పువ్వులు విచ్చు కుంటు న్నాయి. ఊరంతా విపరీతమైన సందడితో ఉన్నది. పెసరు చెలుకలు ఏరుకొచ్చి, వాకిల్లల్లో వేసి దుడ్లతో గుప్కీ గుప్కిన కొట్టేచప్పుడు. ఆడోల్లు చాటలు గబగబ ఆడిస్తున్నారు. ఊరంతా నల్లగా పెసరు పొట్టుతోటి, బుసితోటి నిండి పోయింది. చిన్న పిల్లలు వచ్చి పెసరు గాయలు గిరుతూ బుసికి గోక్కుంటూ, తల్లులు వెంట తిరుగు తున్నారు.... కొంచెం పెద్ద పిల్లలను పెసాలు ఎత్తుక పోతారేమోనని దగ్గెరికి రానియ్యడం లేదు.

మొగిలి దుడ్డుకర్రతో అయ్యర మియ్యర పెసరగాయ కుప్పను సలుగకొడుతు న్నాడు. ఆ దెబ్బలు, ఆ వేగంచూసి వదినె వరుసగల అచ్చమ్మ "ఏంది పిలగ—జేలు కాస్ల కూసుండి బలం బాగనే తెచ్చుకున్నవ్." అన్నది.

"కొర్తుంటె తప్పుతాది పిల్లా....ఆడెందు రక్కలేనోడు" అన్నది నర్సమ్మ— 'ఆఁ అదేదో యాదృచ్ఛికంగా జరిగిందని ధ్వనించేలాగా'....

"అదిగాదత్తా, ఎప్పుడన్న కోపమచ్చి మా సావిత్రిని దెబ్బేత్తడేమోనని" గౌరమ్మ కిసకిస నవ్వింది ....

"సీ మొగడు నిన్ను కొడుతున్నాడే గౌరు .... అదేం కుదరదు. సంగానికి చెప్పుకుంటె పజీతు (ఇజ్జత్) తీత్తరు"- అచ్చమ్మ

సావిత్రి దూరంగా పెసాల్లు కుప్పజేస్తున్నది .... మొగిలికేసి చూడడంలేదు గాని, ఆ చేతుల్లో ఎంత బలమున్నదోనని ఆశ్చర్యపడుతున్నది. పెసరగాయ కొట్టడం మామూలుగా కాకుండా, ఏదో, కసి, కోపం అందులో ఇమిడివున్నదని సావిత్రికి భయ మయ్యింది.

అప్పుడు మొగిలి ముఖంలోకి చూసింది. ఒళ్ళంతా దిగచెమటలు కారుతుం డగా ఉన్మాదిలాగా బాదుతున్నాడు.

"మావోడు అంగుతె నలుగురిపెట్టు కట్టంజేత్తడు." అన్నది నర్సమ్మ....

సాంభయ్య నాలుగు గోనెసంచులు తీసుకొని వాకిట్లో నిలుచున్నాడు ....

మొగిలి హఠాత్తుగా కొట్టడం ఆపిండు. దుడ్డుకర విసిరేసి వాకిట్లనుంచి బయటకు నడిచాడు .... నర్సమ్మ ఏదో అంటోంది.

సావిత్రి మనసులో ఎన్నో ఆలోచనలు .... జైల్లోనుండి వచ్చిన దగ్గరినుంచి మొగిలి మునుపటితీర్గ ఉంటలేదు. అదేమిటో సావిత్రికేకాదు, నర్సమ్మకు, సాంభయ్యకు అర్థం కావడం లేదు. మాట మృదువుగా, శాంతంగా మాట్లాడుతున్నాడు .... మళ్ళీ అంతలో చిరాకు పడతాడు. అన్నం తిన్నా పరధ్యానమే. ఎక్కువ సేపు మౌనంగా ఉంటున్నాడు .... రాత్రిల్లు ఎన్నోమార్లు లేచి చదువుకోవడం, రాసుకోవడము సావిత్రి చూసింది. అప్పుడెప్పుడో భర్త నాలుగో, అయిదోతరగతో చదివాడని తెలుసుగాని - ఇంత శ్రద్ధగా చదవడం సావిత్రి చూడలేదు. మాటికి మాటికి అత్త మామలతో ఘర్షణ పడుతున్నాడు. "ఏమయ్యిందానకు" సావిత్రికి అర్థం కావడం లేదు.

మొగిలి అట్లా మూడు పానాదుల దగ్గరికి నడిచిండు. బనీను దులుపుకున్నాడు. వేపచెట్టుమీద పక్షులు చేరుతున్నాయి. భూలచ్చిమి చెక్కబొమ్మలకు అవతల గల రాయలింగు దడికి పసుపుపచ్చగా, పసుపు చల్లినట్లు బీరపువ్వులు విరగపూసున్నాయి. అప్పటికి పొద్దుగూంకింది .... ఎటుపోవాలో కానేపు అర్థ కానట్టుగా ఆగాడు. గబగబ అడుగులు వేస్తూ వాగుకేసి నడిచాడు వాగులో పచ్చిపాలలాగా నీళ్ళు, బొలబొల శబ్దం ... బాగా ఒత్తుగా పెరిగిన తుంగ - ఒడ్లకు జిబ్బుగా పెరిగిన ఊడుగు, తక్కలి పొదల్లో బొల్లికోళ్ళు కురకురలాడుతున్నాయి.

నీళ్ళమడుగులో మొగిలి ఈదాడు. నీళ్ళమీద చిన్నచేపలు ఎగురుతున్నాయి. సుళ్ళు సుళ్ళుగా తడలు .... ఒడ్డెక్కి బనీను, ధోవతి పిండుకొని మళ్ళీ తొడుక్కున్నాడు .... తడి ఇసుకమీద బొటనవేలుతో సుత్తి కొడవలి వేశాడు - చీకటి ముదిరినా కొద్ది చిమ్మెట్లు జోరుగా పలుకుతున్నాయి. పడమటికేసి ఆకాశంమీద జాజు పార బోసినట్టుగా ఎర్రగా —

మొగిలికి ఏమీ అర్థంకావడంలేదు. మనసంతా తిమ్మరిగా వున్నది. [illegible]డుపు దుమారం హోరు .... అదేమిటి ? ఎక్కడ నిలువబుద్ధి కావడంలేదు. ఏది చెయ్య బుద్ధి కావడంలేదు. కలలో బతికినట్టుగా .... ఈ స్థితి ఎందుకు కలిగిందో ? మొగిలికి

403

తెలియడంలేదు. కాని, ఒక నిమిషం ఖాళీగావుంటె జైల్లో తనలాగే వివిధ గ్రామాల నుండి వచ్చినవాళ్ళమాటలు, తండ్రిదగ్గు - ఖనెల్లు, ఖనెల్లున, బల్లచెక్కలాగా ఉండి- ఏదో సంపాయించాలనే అన్న ముఖం - మౌనంగా తిరిగే సావిత్రి దీనముఖం — ఇవన్నీ మార్చి మార్చి కన్పిస్తుంటాయి ...

ఇవ్వన్ని తనకెందుకు ? అందరిలాగే తను అంగవడి ఏదో రెక్కల కష్టం చేసుక బతుకుతె - పిల్లలు - మళ్ళా నాయనతీర్గ చేదగ్గు - పోలీసులుకొట్టిన దెబ్బలు మతికొస్తే - మళ్ళీ సంగపోల్ల కలవద్దు అనిపిస్తది. గత మూడురోజులుగా గాలయ్య లక్ష్మిద్వారా కబురు చేస్తున్నడు. తను తప్పించుకు తిరుగుతున్నడు. ఏదో బలుపు ఏని మన్నోని తీర్గ చేండ్లపొంటనే తిర్గుతున్నడు. నాయిన్నకు శాతనైతలేదు - అన్నగాడు కాలేరుకుబోయిండు-తనుఇంట్లనుంచి వెళ్ళిపోతె ఎట్ల? ఈ జేల్లుగిల్లంటె-పొలం ఎనుక కయ్య - పొలం మతికచ్చేసరికి అదే కాళ్ళమీద పొలంకాడికి నడిసాడు. వొడ్లవెంట తిరిగాడు....పక్కవాళ్ళ పొలం నడుములనుంటి పెరిగి పొట్టకచ్చింది. తనదిమాత్రం మోకాలు దాటలేదు. ఇయ్యేడు పంట సున్న అనుకున్నాడు ....

కట్టకావల - గుట్టబోరుకింద- వెంకట్రాజయ్య మామిడితోట. దానికేసి చూడకూడదనుకున్నాడు.... లక్ష్మి చెప్పిన ప్రకారంగా - ఇంకాసేపైతె అక్కడికి గాలయ్య వస్తడు. తనకోసం ఎదురు చూస్తడు.... ఈసారి తప్పక వస్తడని ఎదురుచూస్తరు. అట్లా అనుకుంటూనే — మర్రికింది నుండి, పంటోటమీది నుండి గొల్లపల్లె కేసి నడిచాడు-నకినాలోల్ల కొట్టాలదగ్గరతాళ్ల ఒకటే మోతపెడుతున్నాయి—అప్పటికి మొగిలికి సలిగాలి తోలుతున్నదని అర్థమయ్యింది-ఒంటిమీది గుడ్డలు పులిపచ్చె ఉన్నాయి .... కొట్టంముందు బండమీద కూర్చున్నాడు. కొట్టం లోపల దోమలకు ఎడ్లు చెవులు, తోకలు విసురుకోవడం విన్పిస్తోంది. బిచ్చగాళ్ళ యింటిదగ్గర 'నారి' గొంతెత్తి శ్రావ్యంగా పాడుతోంది .... ఆ పాటలో విషాదమున్నది - 'నారి' మొగుడు దేశాలు తిరిగి ఎప్పుడో ఏడాదికోపారొచ్చి పదిరోజులుండి పోతాడు.... పిల్లలతో ఏడాది పొడుగునా అది తంటాలు పడుతుంది. దాని వయసు ఇరువై అయిదేండ్లకన్నా యెక్కువుండదు.

చుట్ట తాక్కుంట నకినాల ఓదెన్న వచ్చిండు. చీకట్లో మంగాళ్ళ [illegible] తన దొడ్డి ముంగట ఎవరో కూసుండడం చూసి "ఎవలాల్లు?" అన్నాడు.

404

"నేనే పెదనాయిన్న—" మొగిలి ....

ఓదన్న అగ్గిపుల్ల గీకి మొగిలి ముఖం చూసి "ఏందిరా మొగిలి గింత నాత్రి గీడకూసున్నవ్—ఇంట్లేమున్న కిసకిస లాడుకున్నర" అన్నాడు.

" లేదే-పొలంకాన్నుంచ త్తన్న...."

" ఓహో అదా సంగతి-" అన్నాడు ఓదెలు. అతనికి సంతుం పుతికొచ్చింది.

" గీతొవ్వ మీన మంచిదిగాదు. అట్లా మాతాళ్ళ కింద కూసోకపోయినవ్." అన్నాడు ఓదెలు, చుట్ట పరిపేసి చెవులబెట్టుకుంటూ.

మొగిలి అదికాదని చెప్పాలనుకున్నాడు. కాని నాటి పాట వినలేడు. అది వినా లని అట్లాగే కూర్చున్నాడు - పాటయిపోయింది. ఎవరో మీనుండి ఎక్కెక్కి ఏడ్చి నట్టు ....

మొగిలి లేచి బజార్లో కొంత దూరం నడిచిండు నెమ్మదిగా.... గిరుక్కున వెనుకకు తిరిగి వెంకట్రాజయ్య మామిడి తోటకేసి వడివడిగా నడిచాడు— అప్పుడు పెద్దగా నిట్టూర్చిండు— పెద్దబండ గుండెమీది నుంచి దింపినట్టుగా తేలిక పడి నడుప సాగిండు....

మొక్కజొన్న పెరడి మీదినుంచా గాలి వీస్తోంది. ఆకుల వొరుసుకోవడం బలేయింపుగా వున్నది.

o o o

అట్లా పోయిన మొగిలి సరిగ్గా వారం రోజులు గడిచిన తరువాత ముఖమంతా పీక్కపోయి గడ్డంపెరిగి, బట్టలు మాసిపోయి బట్టలకు అక్కడక్కడ రక్తపు గాయలు, చీపురు ముళ్ళు అంటించుకుని గడపలోనికి అడుగు పెట్టాడు. అప్పుడు అంబటాలయ్యింది.

ఎదురుగా దొగ్గుబాయిలో పనిచేస్తున్న మొగిలి అన్న చంద్రయ్య దిగాలు పడి కూర్చుండి ఉన్నాడు. తల్లి నర్సమ్మ చెంపకు చెయ్యానించుగొని కూకున్నది - సాంబయ్య ఇంటి పక్కకు మోటదొక్కన నడురుతున్నడు....

"ఇగో గిదీ భాగోతం—తమ్మున్ని ఏం జేత్తదో నీయిట్టం కొడుక-ఆడు సేతికి రాకుంట ఆగమైపోయిండు. బలువు పనులు మక్కపెరడి ఆలిక్కమై ఇసుర్రాళ్ళంత పెళ్ళలు పెడితె-సోదరుపోతె నేను ఎర్రబెంకల కర్రెపిట్టలోతె మాడి మసై దొగ్గయి

405

అరిసేతులకు నెత్తుర్లు పేరంగ కొట్టినం - మీనాయిన్న దగ్గుకుంట సొడలుసొడలు పోవుకుంట నాగలి దున్నిండు-అందరు దుక్కాలు దున్నుకోవట్టిరి. జొన్నపోత ఎత్తి పోతే-మన్నుబుక్కి మంచినీళ్ళు తాగుతరా?" అంతంలేని మాటలు-నర్సమ్మ గడగడ వొల్లుపోకుంట, గుక్క తిప్పుకోకుండా మాట్లాడింది.

ఈ మాటలేమి పట్టనట్టు - మొగిలి గబగబ ఇంటెనకకు నడిచాడు. ఎడ్ల కొట్టంలో సావిత్రి పెండ తీస్తోంది - మొగిలిని చూసి ఆమెకు చెప్పరాని సంతోషం కలిగింది....దగ్గరికొచ్చి "ఇన్ని దినాలు ఎటు పోయినవ్-కాసంత చెప్పద్దా-" అనాల నుకున్నది. తామిద్దరు మాట్లాడుకుంటుంటె అత్త బయటికొస్తే తనకు చచ్చేంత సిగ్గు. ఆ కళ్ళు ఎంత ఎర్రగయినయో? అనుకుంటూ పశువుల పాకలోనికి వెళ్ళింది.

మొకంమీద నీల్లుచల్లుకొని ఇంట్ల కొచ్చాడు.

" నాకు సావురాదవ్వా ! నేను దచ్చున్న దేశాలు పట్టుక తిరుగుడేంది .... పోనీయ్ సంసారమవ్వను కుక్కల్...." చంద్రయ్య గొంతు వనికింది - మాట తడబడ్డది....

"నీ అనువం మంచిదిగాదుబిడ్డా !" నర్సమ్మ నిట్టూర్చింది....

తల్లి అన్నంటె ఎందుకు ప్రేమగా ఉంటుందో మొగిలికి అర్థమౌతోంది. అన్న నెలానెలా నాలుగు వందలరూపాలు పంపుతడు - ఆ డబ్బుతో భూములు, బాగలు కొనాలని ఆరాటం....

మొగిలి ఒక్క మాటన్నా మాట్లాడకుండా తనకోసం, కట్టిన కంది తడకల 'అర్ర' లకి పోయి మంచంలో పడిపోయాడు. మరోపదినిమిషాలల్లో మొగిలి గుర్రు కొట్టడం విన్పించింది.... బువ్వలు దినేయాల్లకు సావిత్రి గుసగుసగా మొగిలిని ఊపింది. ఎంతలేపినాసాధ్యంకాలేదు, చేసేదేమిలేక, కంచుతలెలో అన్నంపెట్టి పక్కనే మంచినీళ్ళు, కూరగిన్నెపెట్టి అత్తతోపాటు పెరడి కాడికి వెళ్ళింది.

"గాలనికి సిగ్గుశెరంలేదు - పోరగండ్లు, సంసారం ఇడిసిపెట్టి సంగమో సంగమని తిరుగుతుండు - ఊళ్లె పోరగండ్ల సెడగొడుతండు - పోలీసోల్లకన్న తెలివిలేదు. గీ ఎందునెర్క లేనిపోరగండ్ల తాపతాపకు బట్టుకపోతరు గని, అసలోన్ని పట్టుకపోరు - ఆడు ఈల్లకు దొరుకడు. ఏమి నాశినగాలమచ్చిపడి - పొల్లగండ్లు మునుపటి తీర్గలేదు. కయికిలిగాళ్లు, మాదిగోళ్లు, మన్నేలు - ఎవలు మునుపటితీర్గలేరు- థానాలు, ఓట్లు, దూసిముడిసికొప్పు బెట్టడాలు - దొత్తిలకు శెడిపోతండ్లు - నాకు

సావురాదవ్వ - మా అవ్వముండ ఏం రాజ్జెంధారపోసింది. 'ఈయినె' కట్టుకున్న కాన్నుంచి కంటినిండ నిదురపోకపోతి, కడుపునిండ తిన్నదిలేకపాయె - చేసి చేసి నా బొక్కలు రెక్కలు తెల్లవడ్డయి - రగుతం కలికలై పోయింది.... కడుపు బంతింది నర్సికీందనిరి. ఏంభాగ్గెం - కొడుకులు ఎడ్లకెడ్లయిరి - కోడండ్లచ్చిరి - అవ్వా నీ కట్టం తీసేత్తమని ఒక్కలనక పేయిరి - నర్సిముండ, మన్నుల మునిగి మురి నాశిడమై పోవట్టె - పెరడిలో మట్టిపెళ్లలను చిన్నగా నలుగగొడుతూ చిత్తకాత్తె ఎండ చిత్తుబొత్తుసేయంగ నర్సమ్మ సదువుతనే ఉన్నది. ఆ మాటలు ఎవలకు చెప్పు తున్నదో ? సావిత్రికి అర్థం కాలేదు.

"ఇయ్యాల్లరేపు పడుసు పోరగండ్లు ఎంత ఖైరతు గుంటండ్లు - మొగన్ని మెతుకు మింగ నియ్యకుంట చేత్తండ్లు - నాకోడండ్లున్నరు. మరి మీయవ్వ గంతగనం ఏడుత్తంది - ఏమయ్యా గిదినీకు బనావుగాదు. దేశాలు దిరుగ దలుసుకుంటె మరి నన్నెందుకు జేసుకున్నవ్ - గిట్లజేత్తె నేసూరుకోను-అంటండ్లా ? అత్తముందే ఉన్నది గదా! కుక్కతీర్గ మొరగడానికి ? ఎవలేంటే ఏ మున్నది - నర్సిముండ పుటుకే మంచిధిగాదు - నర్సిముండరాతే మంచిదిగాదు." నర్సమ్మ బాయిగడ్డమీది రేగుచెట్టు కిందికి నడిచి ఉరిమి ఉరిమి కురిసిన మేఘంలా మొఖాన కొంగు బెట్టుకొని ఏడ్వ సాగింది.

అప్పటికి పొద్దువాలిపోయింది....తాలుకాలోని షావుకారికి ఒప్పిన జొన్నలు కొలిసి సాంభయ్య ముఖమంతా మాడ్చుకొని పెరడి దగ్గరికి వచ్చిండు.

"పంటసేన్ల శోకాలు బెట్టకే - నీశోకమే మంగట బడ్తంది - వానప్వాల కొడుకులెందుకుపుట్టి -సావనా ? జొన్నలొప్పి నెలైనా సత్తాపంబె తీరక పాయె షావుకారి లంకెకొడుకు అన్నప్పుడు యియ్యకపోలివి ధరదిగిందని పల్లకు (క్వింటల్) ఇరువై రూపాలు కోసుకున్నడు. నూటయాభై రూపాలు ఉద్దునూర్తంగ పోయినయ్."
సాంభయ్య కోపాన్నంత వెల్లగక్కిండు.

సావిత్రి ఏమని చెప్పగలదు? ఆమెకిదంతా పెద్దచిక్కు బిడ్డ కంటెలాగున్నది- తన మొగడు తెలివిమంతుడని తెలుసు - సదుకున్నోడని తెలుసు - మొగడు నాగలి దున్నంగ - ఒంటరిగా ఉన్నప్పుడు గొంతెత్తి పాడటం తెలుసు - మందిలో డప్పు కొట్టుకుంట కుడిసెయ్యి ఇసురుకుంట ఆనాడు మూడు పానాదుల కాడ పాడటం ఇప్పటికిగుర్తే - తనతోటి ఆడోల్లు తన మొగనిగురించి చెప్పే మెచ్చుకోలుమాటలు....

407

ఇవ్వన్ని ఒకపక్క, మరోపక్క- అత్తమామ తిట్లు - ఏదినిజం - తన భర్త చేస్తున్న నేరమేమిటి ? పని చేసుక బతుకాలె - చిన్నతనంనుంచి తనఅవ్వ, అయ్య చెప్పిన మాట - కన్నవారికి కట్టుకున్నవారికి పేరుదేవాలె - ఏం పేరుదేవాలె - అత్తతనను తిడుతదేం ? కన్నతల్లి మాటనే ఖాతరు చేయనోడు నా మాట ఖాతరెట్లా చేస్తాడు. తను వద్దు - అత్తకు, మామకు కోపంకలిగియ్యకు అని మొగిలికి చెప్పగలదా ? అక్కడికి జైలు నుంచి మొగిలి తిరిగొచ్చినప్పుడు ఎడ్లకొట్టంలో భయంభయంగా అనిచూసింది.

"నేను కోపం కలిగిత్తన్ననా ? ఆళ్ళే తెచ్చుకుంటన్నరా ?"

తనుతికమక పడ్డది. "ఏమో నాకేడ తెలుస్తది - ఊకె మీయవ్వనిన్ను తిడితె నాకెందుకో మంచిగని పియ్యదు."

మొగిలినవ్వి "నిజమే సావిత్రి - మరినేనేం జెయ్యాలె చెప్పు - మన్నుల పురుగుతీర్గ బతుకు తెమావోల్లకు మంచి గుంటది - ఇయ్యల్ల రేపు కాలం ఎట్లున్నది నీకు కన్పత్తలేదా ? అటుసూడు సావిత్రి" అన్నాడు.

తను దిక్కులు చూసింది - తనభుజంమీద చెయ్యేసి చూపించిండు - జగ్గయ్య పెరట్ల పోశమ్మ రాలచెట్టు గాలికి ఊగుతోంది- ఆ చెట్టుకు పైభాగంలో గవాకటి తిరుగుతోంది.

"గాలేలపెట్టుకు ఒక్క ఆకన్నాగాలికి ఊగకుంట ఊకున్నదా చెప్పు ?"

"గాలత్తె ఎట్లుంటది ?"

"సావిత్రి మనమంవరం ఈ కొత్తగాలికి రెపరెపలాడక తప్పుతలేదు - నాకు బాగ చెప్పత్తలేదు సావిత్రి."

"ఏమోనయ్యా....నువ్వు పోతే నాత్రినాకు దుఃఖమాగది". గొంతు గురగుర లాడింది....

"నాకు ఎవ్వలను కష్ట పెట్టాలనిలేదు సావిత్రి - కని నాకేందో పిచ్చిలేసినట్టు గున్నది." అన్నాడు....

అవ్వన్ని యాదికొచ్చినయ్. "అయినె" మనుపటితీర్గ ఉంటె మంచిగుండు- తినుకుంట తినుకుంటనే తలెల గీతలు గీత్తడు - ఏసినంతే తిని కానకపోతె చెయ్యి కడుక్కొనిపోతడు....మాట్లాడుకుంట మాట్లాడుకుంటనే టక్కునమూగ మొద్దైపోతడు- మునుపు తల్లి తిడితె తనులిట్టేవాడు - మరీకోపమత్తె సేతుల ఏదుంటె అదిఇసిరి కొట్టె

408

బోడు - ఇప్పుడు ఎవరేమన్న మిటమిట సూసుకుంట కూసుంటడేకాని నేసనికిరాడు. మరీఎక్కువైతె లేసిపోతున్నడు.

ఎందుకో రానురాను మొగిలి గురించి తనకు తెలువకుంటబోయింది - ఆరం దినాలు నీడికిపోయినట్లు - తిండి తిన్నడో లేదో ? మంచంకాడ పెట్టొచ్చిన - లేసింతో లేదో ? కూరగంజు కప్పుత్తదా ?

సావిత్రి గొడ్డలి మర్రేసి పెళ్లలు కొడుతూనే ఉన్నది. ఆమె ముఖం ఎంతకు కందిపోయింది. కుంకుంబొట్టు నుదురుమీద చెమటకు చెదిరి ఎండిపోయింది. మోకాళ్ల దాకా తెల్లగా గీతలుపడ్డాయి. దండ చేతులు సలుపుతున్నాయి - అరిచేతులు బొగ్గలు చిట్లి నెత్తురు పేరుకపోయి భగభగ మండుతున్నాయి ....

పొద్దుబారెడున్నదనగా అత్తాకోడళ్లు గొడ్డండ్లు భుజాల మీద పెట్టుకొని - నీళ్ల చెంబు నెత్తిమీద పెట్టుకొని ఇంటిదారి పట్టారు .... సాయంత్రపుగాలి చల్లగా హాయిగా ఉన్నది....

దారివెంట వెంపలి చెట్లల్లోనో, రేగుతుప్పల్లోనో, చెవుకాయ చెట్లల్లోనో పూరేడు పిట్టలు 'కుర్రు' మంటున్నాయి .... దూరంగా బిచ్చగాళ్ల ఎల్లడు 'ఉరులు' పెట్టివాటికోసం తిరుగుతండు .... కాళ్ళకింద మెత్తగా ఒత్తుగాపెరిగిన గడ్డి. తొవ్వ కటుముటూ "నల్లోలం గడ్డిపూలు" పసుపుపచ్చగా - ఊరుదగ్గరవుతున్నాకొద్ది బొడ్డెమ్మ నాడుతూ చప్పట్లు కొడుతూ ఆడపిల్లలు పాటలు పాడుతున్నారు. సావిత్రికి మతికే లేదు. దసురపండుగ దగ్గరె కచ్చిందని - అంతలోనే ఆమెకు చెప్పరానంత దుఃఖం కలిగింది. ఇంకా పండుక్కు తీసుకపోనుతల్లిగారు ఎవలు రాకనే పోయిరి - అన్నగా డన్న, నాయిన్నన్న - ఓ వారంరోజులు ఈగడబిడలకు దూరంగా పోతే బాగుండునని సావిత్రి అనుకున్నది.

పచ్చగా బీర కాకరపువ్వులు ఊళ్లైపళ్లమీద విరగబూసున్నాయి -

ఇద్దరు ఇల్లు చేరుకునే కన్న ముందే పెద్దమామ ఇల్లొచ్చింది, వాళ్లకొంచెం వీళ్ళకన్న స్థితి పరాలే - ఏదోవాళ్లింట్లో కొత్తగా పిల్లలు తిరుగుతున్నారు - సావిత్రి తొంగిచూసింది - పెద్దబావ పిల్లలు వచ్చినట్టున్నారు.

409

"అయ్యో సెల్లె బావున్నవా?" కురచగా వామనఛాయగా ఉన్న ఒకామె వాకిట్లో

కొచ్చి సావిత్రిని నవ్వుతూ పలకరించి ముఖంమాడ్చుకొని ముందుపోతున్న నర్సమ్మను "చిన్నత్తా బావున్నరా?" అన్నది-కురుపాపె.

"ఆఁ బాగనే ఉన్నంబిడ్డా!" అనుకుంట ఆగకుంటానే ఇంట్లోకి పోయింది -

పొలివాళ్ళ కొట్లాటలు ఏండ్లతరబడి వస్తున్నయ్ సావిత్రికి ఆ సంగతి తెలుసు- అయినా "మీరంత బాగున్నరాఅక్కా! బావచ్చింరా?" సావిత్రి నవ్వడానికి ప్రయత్నం చేస్తూ -

"ఆఁ అందరంవచ్చినం - పిల్లలకు దసుర సెలవులిచ్చారు" అన్నది....

సావిత్రి అక్కకట్టుబొట్టు పరిశీలనగా చూసింది - బస్తీలల్ల ఉండెటోల్లు 'గోల్నాడేసి, చీరకట్టుకుంటె ఎత్తది - పొలాలల్ల పనిచేసేటోల్లకుగోచి పెట్టుకోకుంటె పని ఎల్లది — అనుకున్నది.

"సావిత్రి - ఏడిపనాడున్నది - " అత్తకేకేసింది....

నర్సమ్మకు ఈ కుటుంబమంటే కోపం - ముఖ్యంగా ఈబావమన ఆకామంటె కోపం - మరోపక్క ఆమెమాట తీరుకు "పిల్లమంచిదేనని" ఆమెది కులంగాదని పెండ్లి గూడ బామనోన్ని పిలిసికాకుండ - బాజే బజంత్రీలు లేకుండ, కట్నకానుకలు లేకుండ - దండలు మార్చుకొని నేసుకున్నరట - గతిలేనమ్మకు మతిలేని మొగడంట! ఇంటా వంటా లేని పెండ్లి - తమ అంశానికి నామర్దా తెచ్చిండ్లు - అని కోపం, బావ ఎక్కడ, ఏం పట్లోగం చేస్తడో సావిత్రికి బాగా తెలువదు. కాని బావ "మంచోడని"- సూసినప్పుడె అనుకున్నది....

ఈ విచారాలన్ని ఒదిలిపెట్టి ఇల్లు చేరుకునేసరికి ఇల్లంత అంగడంగడున్నది - దుకసాటుకు సూసింది - మొగిలిరేడు, అన్నంతిని - పల్లెంకడిగి పెట్టిండు - పల్లెం, కడిగినందుకు సావిత్రి నొచ్చుకున్నది .... మరింత ఆగకుండా కొంగునడుములో దోపుకొని ఇంటిపనికి సిద్ధ పడ్డది -

ఎడ్లకొట్టంలో తమబావ చంద్రయ్య - మామ కలిసి ఏదో చిన్నగా మాట్లాడు కుంటున్నారు. మామ గడంచెలో కూర్చున్నాడు - బావ 'గెల్లాల' మీద కూకున్నాడు -

ం ం ం

మొగిలి గీతల లుంగీ మోకాళ్ళదాకా ఎగగట్టాడు. ఉతికిన అంగీ - నున్నగా క్షయించుకున్న గడ్డం - (ఆ సాయంత్రమే గీయించుకున్నాడు) మెడకు గీతల[illegible] చుట్టుకొన్నాడు - అట్లాఅతను ఇంట్లో అడుగు పెట్టి ఆశ్చర్యపడ్డాడు,

మంచమేసి దానిమీద శద్దరు పరుచున్నది-దానిమీద పెదనాయన్న కొడుకు లక్ష్మి నారాయణ కూర్చున్నాడు - లక్ష్మినారాయణ అంటే మొగిలికి గౌరవం - అతని పక్కనే తన అన్న చంద్రయ్య మంచం పట్టెమీద కూర్చున్నాడు - ఆమంచం వెనుక ఇంకొక మంచంలో గొంతుదాకా గొంగడి కప్పుకొని సాంభయ్య జ్వరమొచ్చి పడుకున్నాడు - జ్వరం ఆ సాయంత్రం పూటేవొచ్చింది- అమంచానికి కొంచెం ఎడంగా నర్సమ్మ లక్ష్మినారాయణకేసి మొఖంచేసి కూర్చున్నది. ఎడంచేతిలో నశ్యం డబ్బ, కుడిచేతిలో చిటికెడు నశ్యం, కంచి తడుక సాటుకు ఒక్క మొఖం మాత్రమే సగం కనిపించే టట్లు సావిత్రి నిలబడిఉన్నది.

తను ఇంట్లోకి అడుగు పెట్టడంతోటే మాటలు బందయినయ్....
అంటే తనగురించే వీళ్లంతా కూర్చున్నారని, తనకు అన్నమీద ఇష్టమని, తనకిష్టం లేకున్నా అవ్వలక్ష్మినారాణన్నను తీసుకొచ్చిందని మొగిలికి అర్థమయ్యింది.

"మొగిలి, ఇట్లా వొచ్చికూర్చోరా?" లక్ష్మి నారాయణ-

"ఎప్పుడొచ్చిండ్లన్నా?" అన్నాడు శాంతంగా, తనూ ఓగడంచ తెచ్చుకొని వాల్చుకొని ముందుకూర్చుంటూ మొగిలి.

"పగలు" లక్ష్మినారాయణ-

కాసేపు ఆమాటా ఈమాట అయిన తరువాత - లక్ష్మినారాయణ కంచీన తెచ్చి ముందు పెట్టిచ్చాడు.

"వారీ మొగిలి." లక్ష్మి నారాయణ గొంతు మృదువుగా-

"మననాయిన్నలు పంచుకోంగ తలా ఓమొక్రకుండ సోలెడు గడ్కచ్చింది. రాళ్లు, తుప్పలు తప్ప కక్రమొలువని భూమొచ్చింది. అండ్ల నెత్తురే కలిపింట్లో - దొక్కలే కలిపింట్లో ఇయ్యల్ల మనం కాసంత కడుపుకు దింటన్నం - సిన్ని, సెన్నాయినెనుక మొగోని తీర్గ ఎట్టోలెపని జేసింది- గిప్పుడు ఆళ్ల జవసత్వాలుడిగినయ్- సాతగా కుంటయ్యింది. ఏదో అంగపడి సేసుకబతుకాలె-ఆళ్లను ఎందుకు గొడగొడ సేడ్పిత్తన్నవ్రా?" అన్నాడు.

"నీ బాంచెన్ బిడ్డ - సచ్చినీకడుపున పుడుత-గట్లడుగు- ఎంతకాలం కొట్టి పోసుకోవాలె బిడ్డా! మీకండ్ల ముంగట-మీనాయిన్న నాలుగుమాటలు దెలిసినోడుగన్క- మీఅవ్వకు అంత బలువు పనిపడలే-మరినేనో? తిని తిసక-కొడుకులు కొడుకోలో అని సాదుకత్తి-ఓఅయినె బట్టగడితినా? ఓఅయినె రయికె తొడిగితినా? అన్ని మీమీదనే.

411

పెడితె. గిప్పుడు సాతగా కుంటయ్యింది- అగో మీచిన్నాయినె జూడు. మంచం బట్టిండు. దగ్గు తగ్గకపాయె. ఇంకానాగలి పొంట పోంది ఎల్లదాయె."

"మధ్యలోనే సాంబయ్య గునుసుకుంట" నను, నసరాదే నీ నోరుతోనే ఆడు ఆగమైపోతుండు."

"నీనోరు పడిపోను. అందరు నన్నే అనుండ్లి" నర్సమ్మ ముక్కు చీదింది.

చంద్రయ్య "మీరూకోర్లి-అన్నముంగల చెప్పరా? ఎవుసాయం జేత్తవా? గట్లనే తిర్గుతవా? నీమీన నమ్మకంబెట్టుకుంటె నాగటిమీన కానెత్తేత్తివి-గిప్పుడు జెల్లబడితె తిరిగి తిరిగి పదిహేన్నూర్లు ఖర్చు పెట్టిత్తివి. మనకు సంకలేవడితె ధాన్యం కండ్ల బడ్తది-గుండెగాళ్ళనే సేపని-జెయ్యవడ్తది."

"నీకెర్క లేకపోతే నోరుమూసుకోవుడం మంచిది. నువ్వు బాయిల దిగి తన్నపొగన్క-పైసలు సంపాయించన్నది. గటక్కటి వస్పనీకు మరేది కన్పిత్త లేక-నన్నంటె అనుగని సంగపోల్ల గుండెగాళ్ళంటె మంచిదిగాదు." ముగిలి ముఖం ఎర్రబడ్డది.

కాసేపు ఎవరి బాధ వాళ్ళే చెప్పుకున్నారు. తీవ్రమైన గొంతులతో మొదలేసి-ఏడుపు గొంతులతో ముగించారు. అందరికి మొగిలే కారణం అన్నట్లు మాట్లాడారు. సాంబయ్య ఈడు చెయ్యిబట్టి జూరిండ్లకు నూటయాభై పావుకాలిగాడు ఎగదొబ్బిం డన్నాడు. ఇట్లాంటోడు మరి పెండ్లెందుకు చేసుకున్నాడన్నారు. మారే వీడునన్నానుల్ల గల్సిపోతడన్నారు. చిన్న చిన్నాయినె తీర్గ దేశాలు బట్టి పిచ్చోడై ఎందుగ్గాకుంట సత్తడన్నరు.... సాగపడ్డదన్నరు.... ఇట్లా చాలాఅన్నారు....

లక్ష్మినారాయణ అందరు మాట్లాడిన తరువాత-

"చిన్ని గిది మీ ఒక్క కుటుంబంలోని గడబిడే అనుకుంటండ్లా? మనిషి స్వతాగా ఎవ్వడు చెడ్డవాడుకాడు- ఆడుతోటోల్లతోని కలిసి బతికెటప్పుడెగియ్యన్ని. ఇది అన్ని ఊళ్ళల్ల, అన్ని కుటుంబాలల్ల జర్గుతంది-కుటుంబాలు కుమ్మరాం తీర్గ కుతకుత లాడు తన్నయ్-మన చంద్రయ్య ఊరిడిసి బొగ్గు బాయిల కెందుకుబోయిండు? మొగిలి చెయ్య బట్టా? కుటుంబం పెరిగి సాలక - మరి సాలుడెందుకు లేదు? సాలినంత భూమి లేక-భూమిబాయిలచేసిన నౌఖరిపైసలతోని సంపాయించుకోవల్నని చంద్రన్న అనుకొంటండు. -వారీ చంద్రన్న నువ్వు మూడేండ్ల బట్టి ఎంతెసకేసినవ్ర - అట్ల కట్టునోస్తానిబల్ల

412

సెక్కవై పోయినవ్-మరదలును దవఖాన్ల సుట్టుతిప్పేటందుకే సరిపోయింది. మొగిలి అట్లగాదు కొట్లాడి భూమి గలుసుకుంటనంటండు-ఔనురా మొగిలి—ఇంక సక్కగలేదా? సాంబనాయినేమొ మొగిలి చెయ్యబట్టె షావుకారి జొన్నలధర దించిండనుకుంటండు మనం పండించిన పంటకు తగిన ధర వడ్డదా? ఎప్పుడన్న మొగిలి లేనప్పుడునుత - కనుక వీటన్నిటికి మూలం ఎకర్నొ ఎతుకులాటలనే గీ గంవర గోళ మంతా - కొట్లా టలంత-”లక్ష్మినారాయణ నిట్టూర్చి - తను అసెటోదారి తప్పి పోతున్నానని తెలుసుకొని “సిన్ని ఆనికి ఆలోచించే వయసొచ్చింది. అన్నిటికన్నా ముఖ్యంగాథారొ చ్చింది.... నువ్వుమునుపటి తీర్గ అనకు వానీమొగిలి — అదిమన అవ్వరా! తను కడుపు నూడ్సుకొని నీనోటికి గడుక ముద్దలందిచ్చిన తల్లిరా! నీ ఉచ్చ, పీర్గుడు కడిగి నిన్ను పెంచి పెద్ద జేసిన తల్లి, అన్ని తెలిసినోనివి-ఓపికబట్టాలె-అవ్వను ఏమీ అనద్దు.”

“నేను మా అంట-మావోడు పెర్దుడుగాడు-కంల్లాడుతండు-నాకేసెు జిగిసచ్చె-పనిజేత్త వాడు నలుగురిపెట్టు చేత్తడు - నా కెర్కలేదా? తాగుడు, సిల్లర పనులు చెయ్యడు - అద్దుబిడ్డా కాలం మంచిగలేదు—సేసేవి మంచిదేగని -” సాంబయ్యకు చెప్పరాక ఊకున్నాడు -

“నాకు ఇయ్యన్ని చెప్సి పిచ్చలేపినట్టున్నదన్నా” మొగిలి రెండు చేతులతో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఎందుకో చంద్రయ్య “వద్దురా? తమ్మీ” అనుకుంట తనూ ఏడ్చాడు ....

నర్సమ్మ అంతు పొంతూలేకుంట ఏదో ఏదేదో వదురుతూ ప్రపంచాన్ని-తన బిడ్డల బాధపెట్టిన దుష్టప్రపంచాన్ని తిట్టి, తను ఏడ్చింది.

సావిత్రి వెక్కి వెక్కి ఏడ్చింది ....

“తుఫానుగాలికి తల్లి మొదలే వూగుతోంది.... ఆకులు అల్లల్లాడిపోతున్నాయి.” లక్ష్మినారాయణ గొనుగుతూ లేచిపోయాడు. ఆయనకు కళ్ళల్లో నీళ్ళూరినయ్. ఒక్క ఏడువనిది సాంబయ్య మాత్రమే .... అతను గడ్డకట్టిపోయాడు. ఊహ తెలిసీ తెలి యని వయసులో - గత్తరసోకి తండ్రి చనిపోవడం, అన్న పదేండ్ల అన్న అప్పుడు కష్టకాలాలకు ఎదురొడ్డి తమందరిని సాదుకరావడం - తన అన్న ప్రతిరూపం లక్ష్మి నారాయణలో చూశాడు.

రాత్రి భోజనాలకులేచారు. ఈ మధ్యలో అందరుకలిసి తిన్నరోజులు అరుదు. నర్సమ్మ వడ్డించింది. సాంబయ్య వెయ్యబోయే పంటల గురించి, భూమి కొనడం గురించి మాట్లాడుతున్నాడు. తాము యెంత గరీబుతనం నుంచి వచ్చింది చెప్పుకొ చ్చాడు. అందరు బడబడ వాగేస్తున్నారు. ఒక్క మొగిలి అందరి ముఖాలమీద వెలిగే సంతోషాన్ని చూస్తూతిన్నాడు. గడగడ ఉరిమి వర్షం కురిసి అంతలోనే మబ్బులన్ని

413

తొలిగిపోయి ఆకాశం తేటతెల్లమై పోయినట్లుగా ఉన్నది.

అందరు తినేసరికి రాత్రి ముదిరిపోయింది. మొగిలి బయటకొచ్చాడు. గాలి ప్రారంభమయ్యింది. చెట్లు గలగల శబ్దంచేస్తూ శివమెత్తినట్లుగా వూగుతున్నాయి... కరంటుతీగలు గాలికి "జువ్వు"మని మోతపెడుతున్నాయి. అంతదాకా జెగ జెగలాడిన చుక్కలను కప్పేస్తూ మబ్బులు కమ్ముకొచ్చాయి.

సాంబయ్య మొగిలి వెనుక నిలబడి "ఆనచ్చేటట్టున్నది - జొన్న చుక్కలు ఎనుకయ్యేటట్టున్నది - జొన్నపోతలు ఎనకైతమేమొ ?"

మొగిలి ఆ గాలిలోనే ఎడ్ల కొట్టంకేసి నడిచాడు. ఎడ్లకొట్టం గుడిసె గాలికి కిరకిరలాడుతోంది. చాలాసేపు "బొంయ్యి"మంటూ వీచే గాలిలో - టపటపా కొట్టు. కానే జగ్గయ్య పెరట్ల రాలాకుల శబ్దంవింటూ కూర్చున్నాడు. రాయలింగు బిడ్డ పిసరాయక్క కాబోలు ఏడుస్తోంది.

మొగిలి ఎంతసేపు అట్లా కూర్చున్నాడోతెలియదు. తలుపులు తెరిచేవున్నాయి ఇంట్ల అందరు నిద్రలో మునిగిపోయారు. తనకోసం కట్టిన కందితడకల అర్రలకు వెళ్ళాడు. సావిత్రి బాగా అలిసిపోయి అడ్డవిడ్డంగా పడి నిద్రపోతోంది. తలుపులు మూసి సావిత్రికి మెలకువ రాకుండా పక్కకు పడుకున్నాడు. కందిన వెలుగులో సావిత్రి ఎండకు వడలిపోయిన లేత ముఖంలోకి చూస్తు ఉండిపోయాడు.

బయట యింకా గాలి మోతపెడుతూ ఉన్నది. గాలికి చింతాకులు చాలా గమ్మత్తుగా మోగుతున్నాయి ....

మొగిలికి నిద్ర పట్టడం లేదు. వెంకట్రాజయ్య మామిడితోట - ఆ తోటలో గాలయ్య మాటలు. తనలాగే వచ్చినవాళ్ళు- తనలాగేవచ్చినవాళ్ళు- తనెప్పుడు ఇది వరకు చూడని పెద్దపెద్ద కళ్ళ ముసలాయన మాటలు.... పదేపదే....కళ్ళు మూసుకున్నా తెరుచుకున్నాకూడా ....

రాత్రి ఎంతయ్యిందో ? పాపం సావిత్రి-బతుకంతా కష్టంతప్ప సుఖమెరుగని తల్లి. తండ్రి,భూమి కొనాలనే ఆలోచనతో బొగ్గు గనుల్లకు పోయి అన్న-ఇల్లు, సంసారం, ఎండ, వాన, చలి, ఎడ్లు, భూమి పంటలు....

తను ఎటి పోతున్నాడు ? ఈ గడ్డ మీదనే- ఈ నేలకోసమే....ఇక్కడే ఉంటాడు- దీనికోసమే పోరాడుతాడు.

మొగిలి చప్పుడు కాకుండా లేచాడు .... తన బట్టలు సదురుకున్నాడు. చప్పుడు కాకుండా తలుపులు తీశాడు.... వర్షం సన్నగా మొదలయ్యింది. గాలి ఇంకా ఉధృతంగా వీస్తూనే ఉన్నది. వాకిట్లోకి వెళ్ళి వెనక్కి తిరిగి చూసి- తలవంచుకొని వడివడిగా గాలిలో చీకట్లో కలిసిపోయాడు.

వర్షం పెద్దదయ్యింది ....గాలి ఆగింది....

o o o

414